ఘనంగా బోనాల ఊరేగింపు

బోనాలను ఊరేగిస్తున్న చందరూర్ గ్రామస్తులు

చందూర్, ఆగస్టు 30 : మండలకేంద్రంలో గ్రామస్తులు బోనాల ఊరేగింపును శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డప్పువాయిద్యాలు, పోతరాజుల విన్యాసాల మధ్య బోనాలను ఊరేగించి, అమ్మవారికి సమర్పించి, పూజలు చేశారు. అనంతరం ఆలయంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అంబర్‌సింగ్, సొసైటీ చైర్మన్ ప్యారం అశోక్, మాజీ సర్పంచ్ సాయారెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ మాధవ రెడ్డి, కుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగుల హక్కుల సాధనకు సమష్టిగా పోరాడుదాం

కంఠేశ్వర్, ఆగస్టు 29 : ఉద్యోగుల హక్కుల సాధనకు సమష్టిగా పోరాడుదామని టీఎన్జీవో రాష్ట్ర, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మారం జగదీశ్వర్, ఎస్ఎం. హుస్సేనీ (ముజీబ్) పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని టీఎన్జీవో కార్యాలయంలో శుక్రవారం జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ అధ్యక్షతన కార్యవర్గసమావేశాన్ని ఏర్పాటు చేయగా.. వారు హాజరై మాట్లాడారు. ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై రాష్ట్ర జేఏసీతో చర్చించి, ఉద్యమ కార్యాచరణను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. ఆనంతరం కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కార్యవర్గసభ్యుడు కొట్టాల సత్యం ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

రెండు గ్యాంగుల మధ్య దాడులు

- **ఒకరికి తీవ్రగాయాలు, పరిస్థితి విషమం**

వినాయక్‌నగర్, ఆగస్టు 30 : నిజామాబాద్ నగరంలోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గౌతంనగర్ చౌరస్తా వద్ద రెండు గ్యాంగుల మధ్య జరిగిన చిన్నపాటి ఘర్షణ పరస్పరం దాడులకు దారి తీసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మధు అనే యువకుడిపై ప్రత్యర్థులైన పవన్, గఫార్‌తోపాటు మరికొందరు యువకులు గురువారం రాత్రి గొడవపడి, కర్రలతో దాడిచేశారు. తీవ్రగాయాలైన మధును చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నారు.

అనారోగ్యంతో 11 నెలల బాలుడు మృతి

వినాయక్‌నగర్, ఆగస్టు 30 : దంపతులు గొడవపడగా యాసిడ్ తాగిన భార్య దవాఖానలో చికిత్స పొందుతుండగా.. అనారోగ్యంతో 11 నెలల వారి కుమారుడు మృతిచెందిన ఘటన జిల్లాకేంద్రంలోని నాగారంలో చోటుచేసుకున్నది. ఐటో టౌన్ ఎస్సై రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాహ్మణ కాలనీకి చెందిన అనురాధ – మహేశ్ దంపతుల మధ్య మూడు రోజుల క్రితం గొడవ జరగడంతో అనురాధ యాసిడ్ తాగింది. దీంతో ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. అనారోగ్యంతో ఉన్న వారి బాబు శుక్రవారం మరణించాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

తమ సర్వీస్‌ను రెగ్యులరైజ్ చేయాలని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబును టీయూకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ కాంట్రాక్ట్ సిబ్బంది కోరారు. నిర్మల్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరైన మంత్రులకు అసిస్టెంట్ ప్రొఫెసర్స్ కాంట్రాక్ట్ సిబ్బంది టీయూ అధ్యక్షుడు దత్తహరి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారని ఉద్యోగులు తెలిపారు.

–డిచ్‌పల్లి, ఆగస్టు 30

సంక్షిప్తంగా..

- **పోగొట్టుకున్న ఫోన్ల అప్పగింత** - నందిపేట్, ఆగస్టు 30: రెండు నెలల క్రితం ఫోన్లు పోగొట్టుకున్న ఖుద్వాన్‌పూర్‌కు చెందిన ఎం.శ్రీనివాస్, వెల్మల్‌కు చెందిన సాయిలుకు సీఈఐఆర్ ఫోర్టల్ ద్వారా వాటిని గుర్తించి శుక్రవారం అప్పగించినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు.
- **హాస్టళ్లలో భోజనం పరిశీలన** - ఆర్మూర్‌టౌన్, ఆగస్టు30: పట్టణంలోని జిరాయత్ నగర్‌లో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ హాస్టళ్లను సమాజ్‌వాది పార్టీ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ మహరాజ్ శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.
- **హామీలను నెరవేర్చాలి**- ఆర్మూర్‌టౌన్, ఆగస్టు30: బీడీ కార్మికులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ నాయకుడు సూర్య శివాజీ అన్నారు. పట్టణంలోని ప్రెస్ భవన్‌లో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. హామీలు అమలు చేయకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.
- **శాంతికమిటీ సమావేశం**- రెంజల్,ఆగస్టు 30: గణేశ్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. సాటాపూర్ గ్రామం రైతు వేదిక భవనంలో శుక్రవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. మండలి నిర్వాహకులు జాగ్రతలు పాటించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఏఈ రాజలింగం, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.
- **చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థుల ప్రతిభ** - నందిపేట్, ఆగస్టు 30: మండల కేంద్రంలోని నియో లిటిల్ ఫ్లవర్ విద్యార్థులు త్రిదండి చిన్నజీయర్ స్వామిజీ ఆధ్వర్యంలో శ్రీప్రజ్ఞ వికాస్ నిర్వహించిన జిల్లాస్థాయి చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రవికిరణ్, కరస్పాండెంట్ అరుణ్ శుక్రవారం తెలిపారు. హైదరాబాద్‌లో సెప్టెంబర్ 2న నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.
- **కార్యాలయం తనిఖీ**- భీమ్‌గల్, ఆగస్టు 30: మండలంలోని దేవన్‌పల్లి గ్రామాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంతోష్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీవో నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

బయోమైనింగ్ విధానం చేపట్టాలి

నగరంలో కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ పర్యటన

నాగారంలో ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, మున్సిపల్ కమిషనర్

కంఠేశ్వర్/ ఖిల్లీవాడి, ఆగస్టు 30 : పెద్ద ఎత్తున చెత్తను గుట్టలుగా పేర్చకుండా బయో మైనింగ్ విధానం చేపట్టాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, మున్సిపల్ కమిషనర్ మకరంద్ సిబ్బందికి సూచించారు. నాగారంలోని ఘనవ్యర్థ పదార్థాల నిర్వహణ ప్లాంట్‌ను వారు శుక్రవారం సందర్శించారు. నగరం నుంచి పెద్ద ఎత్తున వచ్చే ఘన వ్యర్థ పదార్థాలను గుట్టలుగా పేర్చకుండా బయో మైనింగ్ విధానం నిర్వహించి తగ్గించాలని, పునర్వినియోగం చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. వారి వెంట ఇంజినీర్ సోలోమోన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభుదాస్, బయోమైనింగ్ ప్లాంట్ నిర్వాహకుడు వేణు ఉన్నారు.

జిల్లా కేంద్రంలోని ఖిల్లా వాటర్ ఫిల్టర్ బెడ్, జోన్ వన్ కార్యాలయాన్ని మున్సిపల్ కమిషనర్ మకరంద్ తనిఖీ చేసి అధికారులకు సూచనలు చేశారు. నాగారంలోని గోశాలను మున్సిపల్ కమిషనర్ మకరంద్ పరిశీలించి, సిబ్బంది సూచనలు చేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో డ్రైనేజీ నిర్మాణానికి ప్రణాళిక తయారు చేసి, సమస్యను పరిష్కరించాలని సూచించారు.

అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ

సీతారాంనగర్ కాలనీలోని అర్బన్ హెల్త్‌సెంటర్‌ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో రాజశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్, డాక్టర్ అంజన ఉన్నారు.

డ్వాక్రా సంఘాల మహిళలకు రుణాలు అందజేయాలి

- **రూరల్ నియోజకవర్గస్థాయి సమీక్షా సమావేశంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి**

సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

కంఠేశ్వర్, ఆగస్టు 30 : డ్వాక్రా సంఘాల మహిళలకు బ్యాంకులు వంద శాతం రుణాలు ఇచ్చేవిధంగా చూడాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో సెర్ప్, డీఆర్డీఏ, ఉపాధి హామీ సిబ్బందితో డీఆర్డీవో సాయాగౌడ్ శుక్రవారం రూరల్ నియోజకవర్గస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి హాజరై మాట్లాడారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలను డ్వాక్రా సంఘాల్లో చేర్పించాలని, మైక్రో ఎంటర్‌ప్రైజెస్ ఏర్పాటు చేయాలని, పాడి గేదెలు, పౌల్ట్రీలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు కోసం రుణాలు అందజేసి మహిళలు ఆర్థికంగా ఎదిగేలా కృషిచేయాలని సూచించారు. ఉపాధి హామీ కూలీలకు 100 రోజులు పనికల్పించి, ప్రతి కూలీకి రూ.200 కూలి వచ్చేలా చూడాలన్నారు. మార్చిలో నిర్వహించే సమీక్షలోగా టార్గెట్ పూర్తిచేయాలని అన్నారు. సమావేశంలో ఏపీవో రవీందర్, డీపీఎంలు, ఏపీఎంఎలు, సీసీలు, వీఓఏలు, ఏపీవోలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

జక్రాన్‌పల్లి, ఆగస్టు 30 : జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి శుక్రవారం అందజేశారు. జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన 17 మందికి చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో జక్రాన్‌పల్లి మాజీ సర్పంచ్ కాటిపల్లి నర్సారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ జితేందర్‌నాయక్, నాయకుడు వసంత్‌రావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బాల్కొండ ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

బాల్కొండ/ముప్కాల్, ఆగస్టు 30: వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉన్నందున సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. శుక్రవారం బాల్కొండలో ఎంపీడీవో, తహసీల్ కార్యాలయాలను ఆయన తనిఖీ చేశారు. ఓటరు జాబితా సవరణను పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలు వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో విజయ భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీధర్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. ముప్కాల్ మండల కేంద్రంలో ఓటరు జాబితా ఇంటింటి సర్వేను అదనపు కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. తహసీల్దార్ పి.శ్రీకాంత్, ఎంపీడీవో మహ్మద్ ముజాఫరొద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులపై 500 కేసులు

శక్కర్‌నగర్, ఆగస్టు30: ఇటీవల పోలీసు, రవాణా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో వివిధ ప్రాంతాల్లో ఇప్పటి వరకు సుమారు 500 మంది వాహన యజమానులపై కేసులు నమోదు చేశామని బోధన్ మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వాహనాలకు చెందిన అన్ని పత్రాలు ఉంచుకోవాలని సూచించారు. రాబోయే రోజుల్లో కొత్త వాహనాల చట్టం పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని ఆయన వివరించారు.

రూ. 38 లక్షల ఇన్సూరెన్స్ అందజేత

ఖిల్లీవాడి, ఆగస్టు 30 : జిల్లాకు చెందిన రవీందర్ హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తూ ప్రమాదవశాత్తు మృతిచెందాడు. యాక్సిస్ బ్యాంకులో ఇన్సూరెన్స్ కలిగి ఉండడంతో నామినీగా ఉన్న అతడి భార్య కవితకు యాక్సిస్ బ్యాంకు ప్రతినిధులు ఇన్సూరెన్స్ చెక్కును శుక్రవారం అందజేశారు. సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ వీజీకే శివప్రసాద్, బ్రాంచ్ మేనేజర్ భూషణ్, ఆపరేషన్ మేనేజర్ కోటేశ్ మాట్లాడుతూ.. రూ.30 లక్షల చెక్కుతోపాటు ఇద్దరు పిల్లల చదువు కోసం రూ. 4 లక్షల చొప్పున మొత్తం రూ.38 లక్షలు అందజేసినట్లు తెలిపారు.

ఒకే రోజు కుటుంబ సమస్య పరిష్కారం

అవార్డును అందజేస్తున్న న్యాయమూర్తి ఎస్.రవికుమార్

బోధన్, ఆగస్టు 30: పట్టణంలో న్యాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ ద్వారా ఓ కుటుంబ సమస్య ఒకే రోజులో పరిష్కారం అయ్యింది. మీడియేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు గురువారం బోధన్‌కు వచ్చిన జిల్లా జడ్జి సునీత కుంచాలకు ఓ మహిళ సమస్యను నివేదించారు. వెంటనే స్పందించిన జిల్లా జడ్జి ఈ విషయాన్ని పరిష్కరించాల్సిందిగా కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ ప్రతినిధులకు సూచించారు. మహిళకు తన కుమారుడితో ఉన్న ఆస్తి తగాదాను పరిష్కరించారు. ఆమెఆస్తి.. ఆమె తదనంతరం ఇద్దరు కుమార్తెలు, కుమారుడికి సమ భాగాలుగా వర్తిస్తాయని కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ ప్రతినిధులు వివరించారు. సంబంధిత అవార్డును శుక్రవారం బోధన్ జిల్లా ఐదో అదనపు న్యాయమూర్తి ఎస్.రవికుమార్ అందజేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తి, మీడియేషన్ సెంటర్ ప్రతినిధులు పద్మాసింగ్, సుజాత ఉన్నారు.

రుణమాఫీ కాని కుటుంబాల గుర్తింపు

మాక్లూర్, ఆగస్టు30: రుణమాఫీ కాని కుటుంబాల గుర్తింపు కార్యక్రమాన్ని మానిక్‌బండార్‌లోని గ్రామ పంచాయతీలో జిల్లా వ్యవసాయాధికారి వాజిద్‌హుస్సేన్ శుక్రవారం పరిశీలించారు. ఏవో, ఏఈవోలు, రైతులతో ఆయన మాట్లాడారు. రేషన్‌కార్డు లేనివారి కుటుంబ సభ్యులను గుర్తించి యాఫ్‌లో నామోదు చేస్తున్నమని తెలిపారు. ఆయన వెంట ఏడీఏ విజయలక్ష్మి, ఏవో పద్మ, ఏఈవోలు రాజునాయక్, చక్రపాణి తదితరులుపాల్గొన్నారు.

రుణమాఫీ సర్వే సక్రమంగా చేయాలి

మోర్తాడ్, ఆగస్టు30: రుణమాఫీ సర్వేను సక్రమంగా, కుటుంబ సభ్యుల వివరాలు పూర్తిగా వచ్చేలా చేయాలని భీమ్‌గల్ ఏడీఏ శ్రీనివాస్‌రాజు సూచించారు. శుక్రవారం కమ్మర్‌పల్లి మండల ఉప్లూర్ గ్రామంలో నిర్వహించిన రుణమాఫీ సర్వేను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

ఆరోగ్య సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

మోర్తాడ్, ఆగస్టు30: గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ఆరోగ్య సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్ సూచించారు. శుక్రవారం కమ్మర్‌పల్లి మండలం కోనాసముందర్ గ్రామంలో ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న ఫ్రైడేడ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం చౌట్‌పల్లి పీహెచ్‌సీని తనిఖీ చేసి గ్రామాల్లో జ్వరాల పరిస్థితి, డెంగీ కేసుల నమోదు, ఆరోగ్యసర్వే తదితర అంశాలపై డాక్టర్ సుప్రియతో చర్చించారు. కార్యక్రమంలో ఆర్మూర్ డివిజన్ మలేరియా అధికారి సాయన్న, ఆరోగ్య విస్తరణ అధికారి సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

కాలనీవాసులకు అవగాహన

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు30: పట్టణంలోని శాస్త్రీ నగర్, రాంనగర్, కమలాకర్ నెహ్రూ కాలనీ, జెమ్మన్ జెట్టి కాలనీల్లో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించినట్లు డాక్టర్ ఫిర్దోస్ ఫాతిమా తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శాంత, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, భట్టు శ్యామల పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

బోధన్, ఆగస్టు 30: తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా బోధన్ 'పంప సాహితీ పీఠం' ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం పట్టణ శివారు ఆచన్‌పల్లి ఇందూర్ హైస్కూల్‌లో నిర్వహించారు. పీఠం సభ్యుడు పురానే అజయ్‌కుమార్, పాఠశాల కరెస్పాండెంట్ కొడాలి కిషోర్ మాట్లాడారు. తెలుగు భాష ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో జ్యూడిషియల్ జడ్జి శేష తల్ప శాయి, పంపసాహితీ పీఠం ప్రముఖులు పాల్గొన్నారు.

దవాఖానలో ఆశ కార్యకర్త వైద్య సేవలు

గర్భిణికి వైద్యం అందిస్తున్న ఆశ కార్యకర్త

నందిపేట్, ఆగస్టు 30: దవాఖానకు వచ్చిన రోగులకు వైద్య సేవలు చేయాల్సిన సిబ్బంది పట్టించుకోకపోవడంతో గర్భిణికి ఆశ కార్యకర్త వైద్య సేవలు అందించింది. డొంకేశ్వర్ మండలం నికాల్‌పూర్ గ్రామానికి చెందిన గర్భిణి శుక్రవారం సాధారణ చికిత్సల కోసం డొంకేశ్వర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చింది. ఆమెను 102 అంబులెన్స్‌లో దవాఖానకు తీసుకువచ్చిన ఆశ కార్యకర్త వీణ వైద్య సేవలు చేసి మళ్లీ అంబులెన్స్‌లో ఇంటికి తీసుకువెళ్లింది. వైద్యుడు, ఇద్దరు స్టాఫ్ నర్సులు, సిబ్బంది దవాఖానలో ఉన్నప్పటికీ పట్టించుకోలేదు. వైద్యులు, సిబ్బంది తీరుపై స్థానికులు మండిపడుతున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

శక్కర్‌నగర్, ఆగస్టు 30: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా కార్యదర్శి రఘురాం డిమాండ్ చేశారు. బోధన్ పట్టణంలోని పీఆర్టీయూ భవనంలో శుక్రవారం సంఘ సమావేశాన్ని బోధన్ డివిజన్ ఇన్‌చార్జి అంజలి అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కార్యదర్శి మాట్లాడారు. అనంతరం బోధన్ మండల కమిటీని 21 మందితో ఎన్నుకున్నారు. సమావేశంలో ఆ సంఘండివిజన్ ఇన్‌చార్జి అంజలి, కార్తీక్, శివాజీ, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

రేసు హన్మాండ్లు కుటుంబానికి పరామర్శ

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఖిల్లీవాడి, ఆగస్టు 30 : బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రేసు హన్మాండ్లు కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం పరామర్శించారు. పెద్దకర్మ కార్యక్రమానికి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు సత్యప్రకాశ్, ఎనుగందుల మురళి, కరిపె రాజు, యెండల ప్రసాద్, సాదిక్, కృష్ణ ఉన్నారు.

మానసికంగా దృఢంగా తయారుకావాలి

ఖిల్లీవాడి, ఆగస్టు 30 : ఇటీవల కాలంలో మహిళలపై దాడులు పెరిగిపోయాయని వారు మానసికంగా, శారీరకంగా దృఢంగా తయారుకావాలని జిల్లా మహిళా సంక్షేమాధికారిణి రసూల్‌బీ, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు నర్రా రామారావు అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో మహిళపై లైంగికదాడులు, భారత రాజ్యాంగంపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. అనంతరం రాజ్యాంగంపై ముద్రించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కోయాడ నర్సింహులు, నరేశ్, మల్లయ్య, అనురాధ పాల్గొన్నారు.

స్నేహ సొసైటీ కృషి అభినందనీయం

జిల్లా కేంద్రంలోని స్నేహ సొసైటీ ఫర్ రీకన్‌స్ట్రక్షన్ అంధుల పాఠశాలలో నిర్వాహకులు అంధ విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథులుగా జిల్లా సంక్షేమాధికారిణి రసూల్‌బీ, మాజీ కార్పొరేటర్లు చంద్రకళ, మాయవర్ సాయిరాం హాజరై మాట్లాడారు. మానసిక దివ్యాంగుల సంక్షేమం స్నేహ సొసైటీ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. అంధ విద్యార్థులు బాగా చదువుతుండడంపై సంతోషం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ జ్యోతి, వైస్‌ప్రిన్సిపాల్ రాజేశ్వరి, కార్యదర్శి సిద్ధయ్య, జీవన్‌రావు, రజిత, పరమేశ్వరి, లక్ష్మి, రాకేశ్ పాల్గొన్నారు.

ఇంధన వనరులను కాపాడాలి

సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్

డిచ్‌పల్లి, ఆగస్టు 30 : టీయూలో తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో డాక్టర్ సత్యనారాయణరెడ్డి మావురపు అధ్యక్షతన జాతీయ సైన్స్ డేను శుక్రవారం నిర్వహించారు. భారత రక్షణ శాఖ పరిశోధన, అభివృద్ధి సంస్థ – నాగపూర్ (డీఆర్డీవో) సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ చంద్రశేఖర్ హాజరై.. 'సుస్థిరాభివృద్ధి – పునరుత్పాదక వనరుల పాత్ర' అంశంపై కీలకోపన్యాసం చేశారు. ప్రధాన పునరుత్పాదకత వనరులైన సౌరశక్తి, పవనశక్తి, జలశక్తులను కాపాడుకోవాలన్నారు. లేకపోతే ఓజోన్ పొర దెబ్బతిని ప్రజలు క్యాన్సర్ బారినపడతారని తెలిపారు. టీయూ రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ.. మానవ మనుగడకు శాస్త్రసాంకేతిక రంగంలో జరిగే నూతన వినూత్న ప్రయోగాలే దోహదం చేస్తాయన్నారు. ప్రిన్సిపాల్ సీహెచ్.ఆరతి, టీజీ కాస్ట్ నోడల్ అధికారి వాసం చంద్రశేఖర్, బయోటెక్నాలజీ హెడ్ డిపార్ట్‌మెంట్ డాక్టర్ ప్రసన్నశీల, డైరెక్టర్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ డాక్టర్ పున్నయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శరత్, నాగేంద్రబాబు, రామేశ్వర్‌రెడ్డి, అపర్ణ, నర్సయ్య, రమ్య పాల్గొన్నారు.

టిఫిన్ సెంటర్ల తనిఖీ

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు30: పట్టణంలోని పలు టిఫిన్ సెంటర్లను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రాజు తనిఖీ చేపట్టారు. పరిశుభ్రత పాటించకపోతే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

ఫ్రైడే-డ్రైడే పాటించాలి

ఎడపల్లి, ఆగస్టు 30: మండలంలోని ఎంఎస్సీఫారం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఇన్‌చార్జి డీఎల్‌పీవో మధుకర్ శుక్రవారం తనిఖీ చేశారు. జీపీ కార్యదర్శి రాజుకు గ్రామ పరిశుభ్రతపై సూచనలు చేశారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే–డ్రైడే పాటించాలని అన్నారు. ఆయన వెంట ఎంపీవో మన్‌మోహన్ శర్మ తదితరులు ఉన్నారు.

బాలుడిని తల్లికి అప్పగింత

రుద్రూర్, ఆగస్టు 30 : ఓ బాలుడు మిస్సింగ్ కాగా పెట్రోలింగ్‌లో గుర్తించిన పోలీసులు తల్లికి అప్పగించారు. రెంజల్ మండలం నీలా క్యాంపులో హిందు తన కుమారుడితో నివాసం ఉంటున్నది. ఈ నెల 29న రాత్రి నుంచి ఆమె కుమారుడు యశ్వంత్ (10) అదృశ్యమైనట్లు ఫిర్యాదు చేసింది. రుద్రూర్ మండలకేంద్రంలో పెట్రోలింగ్‌లో యశ్వంత్‌ను గుర్తించిన పోలీసులు.. హిందుకు శుక్రవారం రాత్రి అప్పజెప్పినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. కార్యక్రమంలో జమిందార్ అంజద్ పాల్గొన్నారు.

పచ్చలనడ్కుడలో హెల్త్ క్యాంపు

వేల్పూర్, ఆగస్టు 30: మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామంలో వేల్పూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి శరత్‌చంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. జ్వరం బాధితులను పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులను అందించారు. సీహెచ్‌వో నారాయణ, ఎంఎల్‌హెచ్‌పీ అర్చన, హెల్త్ సూపర్‌వైజర్ తబిత, జీపీ కార్యదర్శి నవనీత తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముందు నుంచి ఆటో చోరీ

వినాయకనగర్, ఆగస్టు 30 : నగరంలోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి ఓ ఇంటి ఎదుట నిలిపి ఉంచిన ఆటో రిక్షా చోరీకి గురైంది. ఎస్సై మహేశ్ కథనం ప్రకారం.. కంఠేశ్వర్‌కు చెందిన ఇమ్రాన్ తన ఆటోరిక్షాను గురువారం రాత్రి తన ఇంటి ఎదుట పార్క్ చేసి ఉంచాడు. శుక్రవారం ఉదయం ఆటో కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు